# అల్లాహ్ తఆలాను నమ్ముకొనుట గురించి
# మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితం ఆధారంగా గొప్ప ఆదర్శం

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 09.10.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్ దైవభరోసా సంఘటనలను వివరిస్తూ హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు రజియల్లాహు అన్హు ఇలా వ్రాశారు. వైద్య చికిత్స విషయంలో హజ్రత్ అలైహిస్సలామ్ పద్ధతి ఏమిటంటే, ఎప్పుడూ ఒకే రకమైన చికిత్సను చేసేవారు కాదు. బదులుగా, ఒకే అనారోగ్యంలో ఇంగ్లీష్ మందులను కూడా వాడేవారు, యునానీ మందులను కూడా వాడేవారు. ఎవరైనా ఏ వ్యక్తి అయినా ఉపయోగకరమైన సలహా ఇస్తే దానిపై కూడా పాటించేవారు. ఒకవేళ ఎవరికైనా కల ద్వారా ఏదైనా జ్ఞానం లభిస్తే, కొన్నిసార్లు దానిపై కూడా ఆచరించే వారు. దీనితో పాటు ప్రార్థన కూడా చేసేవారు. ఒకే సమయంలో డాక్టర్లతో మరియు హకీమ్‌లతో కూడా సంప్రదింపులు జరిపేవారు. వైద్య పుస్తకా లను చూసి కూడా చికిత్సలో సహాయం తీసుకునేవారు. మొత్తంగా చెప్పాలంటే, చికిత్సను ఒక సమ్మేళనంలా మార్చేవారు. అయితే ఆయన (అ) అసలైన భరోస మాత్రం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలాపైనే ఉండేది.

ప్రవక్తలు మరియు సాధారణ మనుషుల అశాంతి మధ్య తేడాను స్పష్టం చేస్తూ హజ్రత్ సాహిబ్ అలైహిస్సలామ్ ఇలా ఉపదేశించారు. మనిషికి మానవ స్వభావం రీత్యా ఆందోళన కలగడం అనేది సహజం, ఇది మానవ నైజంలో భాగం మరియు ప్రవక్తలందరూ కూడా ఈ విషయంలో పాలుపంచుకున్నారు. బద్ర్ యుద్ధ సమయంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకి కూడా ఆందోళన కలిగినట్లుగానే. సాధారణ ప్రజలకు మరియు ప్రవక్తలకు మధ్య తేడా ఏమిటంటే, సాధారణ ప్రజల వలె ప్రవక్తల ఆందోళనలో ఎప్పుడూ నిరాశ ఉండదు. దేవుడు తమను ఎప్పటికీ నాశనం చేయడని వారికి పూర్తి నమ్మకం ఉంటుంది. ఆయన ఇలా ఉపదేశించారు. నా స్వంత పరిస్థితి ఏమిటంటే, నన్ను మండుతున్న అగ్నిలో పడేసినా సరే, నేను ఎప్పటికీ నాశనం కాననే భావనే నాలో ఉంటుంది. మంటలున్నాయి కాబట్టి ఆందోళన కలుగుతుంది, మంటల వల్ల మనిషి కాలిపోతాడు. కానీ, ఓ అగ్ని! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా మారు మరియు ఆయనకు శాంతికి కారణం కమ్ము అనే దైవిక పిలుపు ఇప్పుడే వస్తుందనే ఆశ ఉంటుంది. కానీ, ఇతర ప్రజల ఆందోళనలో నిరాశ ఉంటుంది. విశ్వాసం లేనివారిలో నిస్పృహ ఉంటుంది. వారికి అల్లాహ్ పై ఎలాంటి నిరీక్షణ ఉండదు మరియు ఇది అవిశ్వాసం. ఈ స్థితి అవిశ్వాసంతో కూడుకున్నది. అందువల్ల, అశాంతి సమయంలో అల్లాహ్ తఆలాపై భరోస ఉంచడం అనేది ప్రవక్తల ప్రత్యేకత. అదేవిధంగా, ఒక విశ్వాసి కూడా ప్రవక్తల, ముఖ్యంగా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నత్ ను అనుసరిస్తూ నిరాశ నిస్పృహలను తన దరిచేరనీయకూడదు. అశాంతి సమయంలో కూడా అల్లాహ్ తఆలాపై పూర్తి భరోసా ఉండవలెను. భౌతిక సాధనాలను ఉపయోగించవలెను, ప్రార్థనలపై (దుఆలపై) ప్రత్యేక జోరు ఉండాలి మరియు ఆ తర్వాత

అల్లాహ్ తఆలాపై నమ్మకం ఉంచాలి. విశ్వాసులకు కూడా ఆయన ఈ హితవు చెప్పారు: విశ్వాసి పని కూడా ఇదే; అతనికి అల్లాహ్ తఆలాపై పూర్తి భరోసా ఉండవలెను మరియు ఎలాంటి నిరాశ దరిచేరకూడదు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజియల్లాహు అన్హు ఇలా వ్రాశారు: మున్షీ జఫర్ అహ్మద్ సాహిబ్ కపుర్తలవి (రజి) ఇలా వివరించారు: జల్సా సాలానా సందర్భంగా ఏర్పడిన ఆర్థిక ఇబ్బంది కారణంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్ అతిథుల కోసం తన సతీమణి ఆభరణాలను విక్రయించి లేదా కుదువ పెట్టి ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల తర్వాత మళ్ళీ ఖర్చుల గురించి ఆందోళన కలిగినప్పుడు, హజ్రత్ గారిలా చెప్పారు: ఎవరి కోసం ఈ అతిథులు వచ్చారో, అతడే స్వయంగా ఏర్పాట్లు చేస్తాడు. మరుసటి రోజు ఉదయం వివిధ ప్రాంతాల నుండి యాభై మరియు వంద రూపాయల అనేక మనీ ఆర్డర్లు అందాయి. ఈ సంఘటన ద్వారా లభించే పాఠం ఏమిటంటే, అల్లాహ్ తఆలాపై పరిపూర్ణమైన భరోసా ఉంచేవారు అవసరమైన సమయంలో దేవుని ద్వారా పరోక్ష సహాయాన్ని పొందుతారు.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) ఇలా వివరిస్తున్నారు: మా హజ్రత్ గారి ప్రవచించేవారు: తన దగ్గర సంపద ఉందని ఒకరు సంతోషిస్తారు, తన సంతానం చాలా మంది ఉన్నారని మరొకరు సంతోషిస్తారు, మరియు తన అనుచర వర్గం చాలా పెద్దదని ఇంకొకరు సంతోషిస్తారు. కానీ నా దేవుడు సర్వశక్తిమంతు డని నేను సంతోషిస్తున్నాను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలామ్) ఇలా ఉపదేశించారు. అసలైన ఉపాధి ప్రసాదించేవాడు అల్లాహ్ తఆలా. ఎవరైతే అతనిపై భరోసా ఉంచుతారో, ఆ వ్యక్తి ఎన్నటికీ ఉపాధికి దూరంగా ఉండలేడు. అతడు తనపై నమ్మకం ఉంచిన వ్యక్తికి ప్రతివిధంగా, ప్రతి చోట నుండి ఉపాధిని సమకూరుస్తాడు. అల్లాహ్ తఆలా ఇట్లనెను. ఎవరైతే నాపై నమ్మకం ఉంచి, దైవభరోసా చేస్తారో, వారి కొరకు నేను ఆకాశం నుండి కురిపిస్తాను మరియు వారి పాదాల క్రింద నుండి వెలికితీస్తాను. కనుక ప్రతి ఒక్కరూ అల్లాహ్ తఆలాపైనే పూర్తి భరోసా ఉంచవలెను.

హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రజి) ఇలా ఉదహరించారు: హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ (రజి) చిన్నతనంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్ ఒక విశ్వాసాన్ని నింపే కథను వినిపించారు. ఒక పెద్దమనిషి హితవు మేరకు ఒక దొంగ దొంగతనం మానివేసి, అల్లాహ్ తఆలాపై నమ్మకం మరియు దైవభీతి అలవర్చుకున్నాడు. దాంతో అతని అవసరాలు దైవిక రీతిలో తీర్చబడసాగాయి. పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలోని సూక్తులు అతని హృదయంలో అల్లాహ్ తఆలా మహోన్నతను, పరిజ్ఞానాన్ని ఎంతగానో పెంచేశాయి, ఫలితంగా అతను దైవ ప్రేమలో తన్మయత్వంతో పరితపించిపోయాడు. ఈ సంఘటన మనకు ఒక పాఠాన్ని నేర్పుతుంది: నిజమైన దైవ భరోసా, దైవ భీతి మనిషిని అల్లాహ్ తఆలా సాన్నిధ్యం మరియు పరిజ్ఞానం యొక్క అటువంటి ఉన్నత స్థానానికి చేరుస్తాయి, అక్కడ లౌకిక అవసరాలు కూడా అతని అనుగ్రహంతో సులభంగా తీర్చబడతాయి.

ప్రజలు సాధారణంగా చిన్న పిల్లలకు లోతైన విషయాలు అర్థంకావని అంటారు. కానీ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్, హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) గారి వయస్సు కేవలం తొమ్మిది సంవత్సరాలు ఉన్నప్పుడే ఆయనకు ఈ కథను వినిపించారు. ఖచ్చితంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్, హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ గారి మేధస్సుకు తగినట్టుగానే ఈ కథను వినిపించి ఉంటారు. ఆ చిన్నారి ఆ విషయాన్ని అర్థం చేసుకోగలడని ఆయనకు తెలుసు, అదే సమయంలో చిన్నతనం నుండే పిల్లలలో దైవభరోసా ప్రాముఖ్యతను పెంపొందించాలనే ఉద్దేశం కూడా ఆయన ముందుంది. కాబట్టి, ఈ శిక్షణా సూత్రాలన్నీ మనందరికీ మార్గదర్శకాలుగా ఉన్నాయి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా ప్రవచించేవారు: నా దృష్టిలో రసాయన శాస్త్రవేత్తలు (కీమియాగర్ – లోహాలను బంగారంగా మార్చే విద్యను అన్వేషించేవారు) అందరికంటే పెద్ద బహుదైవారాధకులు. వీరు ఉపాధి

కోసం ఇలా ఇతరుల చుట్టూ తిరుగుతుంటారు, అల్లాహ్ తఆలా ఉపాధి సంపాదన కోసం న్యాయబద్ధంగా నిర్ణయించిన మార్గాలను, సాధనాల ను ఉపయోగించరు. ఆయనింకా ఇట్లనిరి: దైవభీతి అనేది ఎటువంటి వస్తువు అంటే, ఎవరికైతే ఇది లభిస్తుందో, అతనికి సర్వలోకాల అనుగ్రహాలు లభించినట్లే. గుర్తుంచుకోండి! దైవభీతి గలవాడు ఎప్పటికీ ఎవరికీ మొరపెట్టుకోవాల్సిన అవసరం రాదు. బదులుగా అతను ఏ స్థానంలో ఉంటాడంటే, అతను ఏది కోరుకున్నా అల్లాహ్ తాను అడగకముందే దానిని సమకూరుస్తాడు. ఆయన (అ) ఇట్లనిరి. నేను ఒక దైవ స్వప్నంలో అల్లాహ్ తఆలాను చూశాను; అల్లాహ్ తఆలా నా మెడలో చేతులు వేసి ఇలా అన్నాడు: ఓ (అబ్దుల్లా)! నీవు కేవలం నా వాడివైపో,అప్పుడు ఈ ప్రపంచమంతా నీదే అవుతుంది.

కావున ఇది ప్రవక్తలు, దైవజనులు మరియు పుణ్యాత్ములు అందరూ ఆచరించి చూసిన దివ్యమైన మార్గం. మూఢజనులు దీనిని వదిలిపెట్టి వనమూలికల అన్వేషణలో ఇటుఅటూ తిరుగుతుంటారు. ఇంత శ్రమను వారు వనమూలికలను సృష్టించిన ఆ సృష్టికర్త కొరకు ధారపోస్తే, తమ మనోరథాలన్నింటినీ పొంది ఉండేవారు.

హజ్రత్ సాహిబ్ ఇలా అన్నారు: పాస్టర్ అబ్దుల్లా ఆథమ్‌కు పదిహేను నెలల వ్యవధిలో నాశనం సంభవిస్తుందని ఒక భవిష్యవాణి ఉండింది. ఆ పదిహేను నెలల గడువు ముగిసే సమయానికి, కొందరు ఆత్మీయులు ఏడుస్తూ ఆథమ్ మరణించాలని ప్రార్థిస్తున్నారు. కానీ హజ్రత్ సాహిబ్ (అలైహిస్సలామ్) ఆ ఆత్మీయుల ఈ చర్యను అసంతృప్తిగా భావించి ఇలా అన్నారు: అల్లాహ్ కంటే ఎక్కువగా అతని వాక్యాల పట్ల వేరొకరికి పౌరుషం ఉండగలదా? ఆయన ఇంకా అన్నారు: అల్లాహ్ తఆలా ఒక విషయం ఇలా జరుగుతుందని చెప్పినప్పుడు, అది ఖచ్చితంగా జరుగుతుందని మనం నమ్మాలి. మనం ఒక వ్యక్తిని సత్యవంతుడిగా అంగీకరించిన తర్వాత, ఆయన మాటలను విశ్వసించడమే మన బాధ్యత.

అబ్దుల్లా ఆథమ్‌తో జరిగిన చర్చా వేదిక సందర్భంగా ఒక సందర్భంలో, కొందరు మిత్రుల దృష్టిలో సమాధానం చెప్పడం కష్టంగా ఉండే కొన్ని ప్రశ్నలు ఎదురయ్యాయి. వారి ఆలోచన ప్రకారం ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం కోసం (హజ్రత్ సాహిబ్‌తో) సలహా చేయవచ్చు అనుకున్నారు. ఈ నేపథ్యంలో, కొన్ని ఉపయోగకరమైన రిఫరెన్స్‌లు వెతికి హజ్రత్ సాహిబ్ అలైహిస్సలాం సమక్షంలో ఇలా విన్నవించారు: హజ్రత్! రేపటి చర్చ కోసం మనం సలహా జరపవచ్చు. అప్పుడు హజ్రత్ సాహిబ్ చిరునవ్వు నవ్వి ఇలా అన్నారు: మీ దుఆ ఒక్కటే చాలు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) గారిలా వ్రాశారు: ప్రవక్తలు చాలా విషయాలలో సలహాలు సేకరిస్తారు, వారి కంటే ఎక్కువగా ఎవరూ సంప్రదింపులు జరపరు. కానీ కొన్ని ప్రత్యేక సమయాలు వస్తాయి, ఆ సమయంలో వారు ఇతర మాధ్యమాలను వదిలిపెట్టి, కేవలం అల్లాహ్ సహాయంపై మాత్రమే పూర్తిగా భరోసా ఉంచడాన్ని ఇష్టపడతారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలామ్) ఆయినా కమాలాతె ఇస్లామ్ పుస్తకంలోని అరబ్బీ భాగాన్ని రచిస్తున్నప్పుడు, దానిలోని రెండు పెద్ద పేజీల రాతప్రతిని హజ్రత్ హకీమ్ మౌల్వీ నూరుద్దీన్ సాహిబ్ (రజి) గారికి అందజేశారు; దానిని ఫార్సీలోకి అనువదించడం కోసం హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం గారు సియాల్‌కోటీ (రజి) గారికి చేరవేయాలని చెప్పారు. ఆ వ్యాసంలో ఎంతటి సాహిత్యం ఉందంటే, అల్లాహ్ తఆలా తనకు అంత చక్కటి భావాన్ని ప్రసాదించాడని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గర్వపడ్డారు. కానీ, ఆ రెండు పేజీలు హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ గారి దగ్గర ఎక్కడో పోయినవి. హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం సాహిబ్ సియాల్‌కోటీ (రజి.) ఆ పేజీల గురించి అడిగినప్పుడు, హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ గారు ముఖం వెలవెలబోయింది (రంగు మారిపోయింది). ఎంత వెతికినా ఆ పేజీలు దొరకలేదు. ఈ విషయం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారికి తెలిసినప్పుడు, ఆయన ఎప్పటిలాగే సంతోషంగా, చిరునవ్వుతో బయటకు విచ్చేసారు. కోపగించుకోవడం లేదా ఆందోళన వ్యక్తం చేయడం మాట దేవుడెరుగు, పైగా మౌల్వీ సాహిబ్‌కు రాతప్రతి పోవడంతో అనవసరంగా ఆందోళన కలిగిందని తానే

స్వయంగా క్షమాపణ కోరారు. మౌల్వీ సాహిబ్ పడుతున్న ఆవేదన చూసి తనకు చాలా బాధగా ఉందని అన్నారు. ఆయన ఇలా అన్నారు: అల్లాహ్ తఆలా తన అనుగ్రహంతో పోయిన కాగితం కంటే మెరుగైన వ్యాసాన్ని వ్రాసే సామర్థ్యాన్ని ప్రసాదిస్తాడని నాకు పూర్తి విశ్వాసం ఉంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్ ఇలా ఉపదేశించారు: ఎవరైతే దర్వేశీ (నిరాడంబరత) మరియు కనాఅత్ (సంతృప్తి) తో ఇస్లాం సేవ చేస్తారో, అది ఒక అద్భుతం మరియు దివ్య సూచనగా మారుతుంది. ఎవరైతే అట్టహాసంగా  చేస్తారో, దానిలో అసలు ఆనందం ఉండదు; ఎందుకంటే దానిలో నమ్మకం, అల్లాహ్ పై భరోసా యొక్క పరిపూర్ణమైన ఆనందం మిగలదు. ఎప్పుడైతే కేవలం దైవభరోసాతో పనులు చేయబడతాయో, అప్పుడు అల్లాహ్ స్వయంగా సహాయం చేస్తాడు. ఈ గుణాలన్నీ ఆత్మీయత నుండే ఉద్భవిస్తాయి.

ఆయన ఇంకా ఉపదేశించారు: అసలు విషయమేమిటంటే, కేవలం దైవభరోసా మాత్రమే మనిషిని విజయ వంతంగా మరియు సఫలీకృతుడిగా మారుస్తుంది. అల్లాహ్ తఆలా ఇట్లనెను. ఎవరైతే అల్లాహ్ పై భరోసా ఉంచుతారో, అల్లాహ్ వారికి తానే సరిపోతాడు. కాకపోతే షరతు ఏమిటంటే, సత్యసూర్యమైన హృదయంతో నమ్మకపు అసలు అర్థాన్ని గ్రహించి, సద్భావంతో అడుగులు వేసేవాడుగా మరియు సహనం, స్థిరమైన మనస్తత్వం గలవాడుగా ఉండాలి. అంతేతప్ప, కష్టాలను చూసి భయపడి వెనకడుగు వేయకూడదు.

హజ్రత్ సాహిబ్ (అ) ఇలా అన్నారు: ఒకవేళ మనిషిపై ధర్మం గురించిన ఆందోళనలు, బాధలు అధిగమిస్తే, అతని లౌకిక వ్యవహారాల బాధ్యతను అల్లాహ్ స్వయంగా వహిస్తాడు. విచారించదగ్గ విషయమేమిటంటే, నిత్యం పెద్ద పెద్ద ప్రమాదాలు, విపత్తులు సంభవిస్తున్నప్పటికీ, ప్రజలు మాత్రం పట్టించుకోవడం లేదు, శ్రద్ధ వహించడం లేదు. మూసా అలైహిస్సలామ్ కాలం నాటి అవిశ్వాసులే నయమనిపిస్తుంది; ఎందుకంటే వారిపై శిక్ష పడినప్పుడైనా వారు శ్రద్ధ వహించి, ఈ విపత్తు తొలగిపోతే మేము విశ్వసిస్తాము అని చెప్పేవారు. కానీ ఈనాటి అవిశ్వాసులు వారికంటే అత్యంత కఠినమైన మనస్తత్వం గలవారు. రోజుకో కొత్త రకం శిక్ష వస్తోంది, కొత్త కొత్త రూపాల్లో దేవుని ఆగ్రహం  వ్యక్తమవుతోంది, కానీ వీరి చెవిన ఇల్లు కట్టుకుని పోరుతున్నా వీరికి పట్టడం లేదు. ఆఖరి కాలంలో రకరకాల విపత్తులు వస్తాయని, ఆ సమయంలో కొందరు సన్మార్గం పొందుతారని, చాలామంది నాశనమవుతారని అల్లాహ్ తఆలా పూర్వం నుండే వాగ్దానం చేశాడు. దేవుడు తన మహిమలను చూపిస్తాడు, కానీ ఆ సూచనల ద్వారా లాభం పొందేది కేవలం సత్యవిశ్వాసులు మాత్రమే.

హుజూరె అన్వర్ ఇలా ప్రవచించారు: ఈ లౌకిక వాసులకు అల్లాహ్ తఆలా సద్బుద్ధిని ప్రసాదించుగాక! తద్వారా వారు అల్లాహ్ తఆలా వైపు మరలాలి. తమ ఇహపర లోకాలను చక్కదిద్దుకునేవారిగా మారాలి. మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలామ్ ను విశ్వసించిన మనలను కూడా అల్లాహ్ తఆలా విశ్వాసంలో మరియు నమ్మకంలో మరింతగా అభివృద్ధి చెందించుగాక! మనం ప్రార్థనలతో పాటు దైవభరోసా అత్యున్నత ప్రమాణాలను సాధించేవారంగా, వాటిలో నిరంతరం పురోగమించేవారంగా ఉందుము గాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -